నినాదం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
తెలంగాణ ప్రాంతీయం
05 సెప్టెంబర్ 2024


# అధైర్య పడొద్దండి..

- మునగాల మండలంలో వర్ష బాధితులను పరామర్శించిన కోదాడ ఎమ్మెల్యే
- పరిస్థితులను చూస్తే హృదయ విదారకం...
- నష్ట బాధితులు సంబంధిత అధికారులకు తెలియజేయండి
- ఇప్పటికే సమగ్ర సర్వేకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది
- ప్రభుత్వం తరపున నష్ట బాధితులకు పరిహారం అందేలా చూస్తా...
- ప్రజలు అప్రమత్తతో మెలగాలని సూచన
- గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు బాధితులకు అండగా ఉండాలని ఆదేశాలు



**మునగాల,సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజుల నుంచి తీవ్ర వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మునగాల మండల పరిధిలోని గ్రామాల్లో వర్ష తాకిడికి పంటపొలాలతోపాటు, ఆస్తి నష్టం నెలకొంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించడానికి స్థానిక కోదాడ ఎమ్మెల్యే నలమాధ పద్మావతి రెడ్డి బుధవారం సాయంత్రం మండలంలో పలు గ్రామాల్లో సందర్శించి, పరిస్థితులను పరిశీలించి, బాధితులను స్వయంగా కలిసి వారి కష్టాలను తెలుసుకొనే ప్రయత్నం చేశారు. మునగాల మండల పరిధిలో కొన్ని గ్రామాలలో వర్ష తాకిడికి నష్టపోయిన బాధితులు ఉన్నారని వారికి ప్రభుత్వం తరుపున నష్టపరిహారాన్ని చెల్లించడంలో ఎటువంటి వెనకడుగు వేయనని నష్టపోయిన బాధితులు మీ గ్రామాల్లో ఉన్న అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఇప్పటికే అధికారులకు వర్షానికి జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం సర్వేకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మన ప్రాంత మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలు ఆదేశించడం జరిగిందని అన్నారు. మండల పరిధిలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు బాధితులకు బాసటగా నిలిచి వారికి అన్నివేళలా చేదోడు వాదోడుగా నిలవాలని కార్యకర్తలని ఆదేశించారు. ఒకానొక సందర్భంలో ప్రజల కష్టాలను చూసి పద్మావతి రెడ్డి కంటతడికి గురయ్యారు. బాధితుల పరామర్శలలో ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు,అధికారులు బాధితులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా కే ఇందుమతి

**వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరం లో మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించ బడతాయని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి ఒక ప్రకటనలో తెలియ జేశారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, ఈ కార్యక్రమంలో పాల్గొం టారని డిఇఓ తెలియజే శారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలో విద్యారంగంలో విశేష కృషి చేసిన 31 మంది ఉపాధ్యాయులను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మా నించబోతున్నమని తెలియజేశారు. హనుమ కొండ జిల్లా నుండి రాష్ట్ర స్థాయికి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, ప్రధానోపాధ్యాయుల విభాగము నుండి తెలంగాణ రెసిడెన్షియల్, బాలికల జూనియర్ కళాశాల హసన్ పర్తి మండలం నుండి కే ఇందుమతి ప్రిన్సిపాల్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికై నట్లుగా తెలియజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎం వేణు ఆనంద్ జిహెచ్ఎం జడ్పి హెచ్ఎస్ రాంపూర్ కాజీపేట, కే హనుమంతరావు జిహెచ్ఎం జడ్ పి హెచ్ఎస్ నడికూడ, నడికూడ మండలం, ఏ రాజేందర్ ఎస్ ఏ బయో సైన్స్ జెడ్ పి హెచ్ ఎస్ బి ఉప్పల్, కమలాపూర్, ఏ రవి ఎస్ఏ బయోసైన్స్ జెడ్పిహెచ్ఎస్ అక్కంపేట ఆత్మకూర్, కే శ్రీనివాస్ ఎస్ఏ ఇంగ్లీష్ జెడ్పి హెచ్ ఎస్ గట్ల నర్సింగాపూర్, భీమదేవరపల్లి,పి చెలిన ఎస్ ఏ ఇంగ్లీష్ జెడ్పిహెచ్ఎస్ వెంకటాపూర్ అయిన వోలు, డాక్టర్ ప్రత్యూష ఎస్ ఏ ఇంగ్లీష్ జి హెచ్ ఎస్ వడ్డేపల్లి, హనుమకొండ, డి రమేష్ ఎస్ ఏ మాథ్స్ జడ్పీహెచ్ఎస్ నీరుకుల్లా, ఆత్మ కూర్, బి అశోక్ కుమార్ ఎస్ ఏ ఫిజిక్స్, సైన్స్ గట్ల నర్సింగాపూర్ భీమదేవరపల్లి, ఎస్ వేణు గోపాలరావు ఎస్ ఏ జెడ్ పి హెచ్ ఎస్ పీచర వేలేర్, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డుకు ఎన్నికైనారు.

## డైట్ అతిథి అధ్యాపకుల ఎంపికను రద్దు చేయాలి

### సంచాకుల డీఎస్ఈఓకి బాధితుల వినతి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 నినాదం న్యూస్:** ఆగస్టు 28న వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో నిర్వహించిన అతిథి అధ్యాపకుల ఎంపికను రద్దు చేయాలని బాధితులు సురేందర్, రమేష్, వేణుగోపాల్ కోరారు. వారు మాట్లాడుతూ ఇందులో సుమారు 15, 16 మంది అభ్యర్థులు హాజరయ్యారని కేవలం డెమో ఆధారంగా ఎంపిక నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారని కానీ ఇందుకు విరుద్ధంగా నిర్ణేతల పక్షపాతం, బంధుప్రీతితో ఎంపిక జరిగిందని, దీంతోపాటు ఎక్కువ శాతం రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చారని, మొత్తం తొమ్మిది పోస్టులకు గాను ఆరుగురిని రిటైర్డ్ ఉద్యోగులను ఎంపిక చేయగా, మరో ముగ్గురు ఎంపికలో నిర్ణేతల పక్షపాతం బందు ప్రీతితో ఎంపిక జరిగిందని దీంతో ప్రతిభగల అసలైన నిరుద్యో గులకు అన్యాయం జరిగిందని, ప్రతిభ కలిగిన వారిని పక్కన పెట్టి, వారికి కావాల్సిన వారిని ఎంపిక చేసుకున్నారన్నారు. ఎంపికైన వారిలో ప్రతిభ లేకపోవడం వల్ల టీచర్ ట్రైనింగ్ అభ్యర్థులకు సరైన బోధన జరగదని తద్వారా విద్యార్థులకు కూడా అత్యధికంగా నష్టం జరిగే అవకాశం ఉంది కాబట్టి. అత్యుత్తమ సమాజ నిర్మాణానికి పునాది రంగమైన విద్యా వ్యవస్థలో ఇలాంటి పరిస్థితి మంచిది కాదని. సదరు ఎంపికను రద్దుచేసి ప్రతిభా ఆధారంగా తిరిగి ఎంపిక నిర్వహించవలసిందిగా వారిని విజ్ఞప్తి చేశారు.



## స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు

**– ఎంఈఓకి వినతి పత్రం అందజేసిన, ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మైపాల్**




**చేవెళ్ల సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** పరిమితిమికి మించి విద్యార్థులను స్కూల్ బస్సులో ఎక్కించరాదని, ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మైపాల్ అన్నారు. బుధవారం ఏబీవీపీ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ చేవెళ్ల పట్టణానికి చెందిన ఓ ప్రయివేటు పాఠశాల బస్సు పరిమితి మించి అధిక సంఖ్యలో విద్యార్థులను పాఠశాలకు తరలిస్తున్న సందర్భంలో ప్రమాదం జరిగే అవకాశం ఉండే అదృష్టం బాగుండి స్వల్ప గాయాలతో బయటపడ్డారని, ఒకవేళ ప్రమాదం జరుగుంటే బాధ్యులు ఎవరు? పాఠశాల యజమాన్యమా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి పాఠశాల లో ఉన్నటువంటి బస్సులను పిట్నెస్ ఉన్నాయా లెవా, అనుభవం ఉన్న డ్రైవర్లు ఉన్నారా లైసెన్స్ ఉన్నాయా బస్సులో మౌలిక వసతులు ఉన్నాయా లెవా చూడాలన్నారు. ఒకవేళ ఈ నిబంధనలు లేకుంటే వెంటనే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, అనిల్, కిషోర్, శివ, విజయ్, నితీష్, ప్రణయ్ ,హరీష్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## నవరాత్రులకు ముస్తాబవుతున్న మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం



**అల్వాల్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** వెంకటాపురం డివిజన్లోని కానాజీ గూడ డైరీ ఫామ్ రోడ్డు లోపల శ్రీ లక్ష్మి గణపతి నవరాత్రి మహోత్సవాలు జరుపుటకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. శనివారం నుండి 17- 9- 24 మంగళవారం వరకు జరిగే నవరాత్రి మహోత్సవాలలో వర సిద్ధి, మహాగణపతి, వెంకట లంబోదర, గజానన ,మహోధర, ఏకదంతా వక్రతుండా, విఘ్నరాజా, ధూమ్ర వర్ణ, మరకత, శ్రీ లక్ష్మీ గణపతి అవతారాలలో దర్శనమిస్తారని పేర్కొన్నారు. ప్రతిరోజు మరకత లక్ష్మీ గణపతి స్వామికి, 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, చండీ హోమాలు అన్న ప్రసాద్ వితరణ ఉంటుందని భక్తులకు తెలియపరిచారు. 11 రోజులు వరుసగా అభిషేక, హవన, దివ్య పత్రార్చనలో పాల్గొన్న వారికి మరకత గణపతి లాకెట్‌ను మహా ప్రసాదంగా ఇవ్వబడుతుంది అని తెలియజేశారు. పాల్గొన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని భక్తులకు విన్నవిం చారు. శుభ బుధవారం రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసా దాలు అందజేశారు. బుధవారం శ్రీలేఖ(మ్యూజిక్ డైరెక్టర్)ప్రత్యేకంగా విచ్చేసి దర్శనానంతరం, ఆలయ మర్యాదలతో ఆమెను సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మవారి నవరాత్రుల మాల దీక్ష

**మహేశ్వరం, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**



భక్తులందరూ భక్తిశ్రద్ధలతో నవరాత్రుల ఉత్సవం సందర్భంగా దుర్గామాత అమ్మవారి ఆశీర్వాదంతో దినదిన అభివృద్ధి చెందాలని సేవాలాల్ మహారాజ్ పూజారి జరుపుల రాజు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. సోమవారం ఉదయం, మనందరి బంజారా జాతి సేవాలాల్ మహారాజ్ ఏడుగురు అక్క చెల్లెల్ల నవరాత్రుల, మాల దీక్ష, స్థలం కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం గ్రామపంచాయతీ మైసిగండి పరిధిలోని సేవాలాల్ మట్, వద్ద మాల వేసుకునే వారు ఎవరైనా ఉంటే సోమవారం ఉదయం ఉదయం రావాలన్నారు. మాల 21 రోజులు వేసుకోగలరు.. మైసిగండి సేవాలాల్ మహారాజ్ పూజారి రాజుకు నెంబర్ 9390874100 సంప్రదించగలరు. ఈ ప్రకటన చూసిన ప్రతి ఒక్కరు ఇతర భక్తులకు 9 మంది కు తెలియజేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కేతావత్ రెడ్యానాయక్, కార్ భారీ చిన్నవత్ రాము, రాందాస్ భగత్ ( తుల్జా భవాని) జవహర్ లాల్, లస్కర్ నాయక్, మైసిగండి మైసమ్మ పూజారి భీచ్యా నాయక్ పెద్దలు భక్తులు స్నేహితులు బంధువులు మిత్రులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంఛార్జ్ ఎంపిడిఓగా జగదీష్ భాధ్యతలు

**మల్లాపూర్, సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):**



ఇటీవల మల్లాపూర్ మండల ఎంపీడీవో రాజేందర్ రెడ్డి పదవి విరమణ తీసుకున్న సందర్భంగా. ఇంచార్జి ఎంపీడీవోగా జగదీష్ బుధ వారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సంధ్భంగా మండల కార్యదర్శులు శాలువా తో సన్మానించి అభినందనలు తెలిపారు.

## ప్రమాద స్థాయిలో కల్వర్టు : ఎంపిడిఒ

**- హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు**

**ఆళ్లపల్లి సెప్టెంబర్ 4 నినాదం న్యూస్**

గత రెండు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలోని లక్ష్మిపురం వెళ్లే మార్గమధ్యలో మూడు నాలుగేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు బ్రిడ్జి కుంగి పోయి రహదారి కోతకు గురైందిజ ప్రమాద స్థాయిలో ఉందని ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ముందస్తుగా ప్రయాణికులు ఆ రహదారి వెంబడి ప్రయాణించవద్దని హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని ఎంపీడీవో తేజవత్ శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు.

# హత్యాచార ఘటనతో జైనూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

**- బందుకు పిలుపునిచ్చిన ఆదివాసీలు**

**- నీవురు గప్పిన నిప్పులా ఆదివాసీల ఆగ్రహం**

**ఆసిఫాబాద్ సెప్టెంబర్04 (నినాదం న్యూస్ )**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండల కేంద్రంలో హత్యాచార ఘటన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివాసి గిరిజనులు ఏజెన్సీ ప్రాంతాల్లో బందుకు పిలుపునిచ్చారు. జైనూరు సమీప ఏజెన్సీ ప్రాంతాలలో బందు సంపూర్ణంగా జరిగింది. జైనూర్ లో పరిస్థితులు అదుపు తప్పేట్టుగా ఉండడంతో, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు స్వయంగా రంగంలోకి దిగారు. ఐదు రోజుల క్రితం గిరిజన ఆదివాసి మహిళపై ఓ వ్యక్తి అత్యాచారం,హత్య చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు నిందితుడు షేక్ మగ్దూం ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మొదట ఈ కేసును రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు, బాధితురాలు స్పృహలోకి వచ్చి, జరిగిన సంఘటన గూర్చి పోలీసులకు తెలిపారు. అత్యచారం,హత్య ప్రయత్నం జరిగిందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివాసి గిరిజనులు ఏజెన్సీ ప్రాంతంలో బందుకు పిలుపునిచ్చారు. బంద్ సందర్భంగా ఆదివాసీలు నిందితుడి ఇంటికి నిప్పు ఆంటి చినట్లు సమాచారం. కాగా వేరే ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి, ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని ఆదివాసి గిరిజనులపై జులుం చేస్తున్నారని భావిస్తున్న ఆదివాసీలు ఈ సంఘటనతో ఆగ్రహం పెళుబికింది, ఓ వర్గం వారిపై, వారి దుకాణ సముదాలపై బుధవారం రోజున దాడి చేసినట్లు సమాచారం. ఆ వర్గం వారికి చెందిన ద్విచక్ర వాహనాలను, కార్లను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది . నివురు గప్పిన నిప్పులాఉన్నటువంటి ఆగ్రహం, జరిగిన సంఘటన నేపథ్యంలో ఒక్కసారిగా బహిర్గతమైంది. ఏజెన్సీ ప్రాంతమైన జైనురులో పరిస్థితులు అదుపు తప్పడంతో స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు రంగంలోకి దిగి పర్యవేక్షిస్తున్నారు. ఆదివాసి గిరిజనులలో గత కొంతకాలంగా ఓ వర్గం వారిపై, తీవ్ర అగ్రహానికి, అసహనానికి గురై ఉన్నారు. స్థానికేతురులైనటు వంటి వారుఇక్కడకు వచ్చి తమపై పెత్తనం చెలాయించడం పట్ల గుర్రుగా ఉన్నారు. ఆదివాసి గిరిజన మహిళపై అత్యాచారం హత్యాయత్నం ఆదివాసి గిరిజనులు తీవ్రంగా స్పందించారు. జరిగిన సంఘటన పట్ల పోలీసులు వెంటనే చర్యలు



చేపట్టిన, నిందితుడిని అదుపులోకి తీసుకున్న, ఆదివాసి గిరిజనులలో ఆగ్రహం చల్లారడం లేదు. ఆదివాసి గిరిజనులలో ఉన్నటువంటి ఆగ్రహాన్ని, అసహనాన్ని గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారు. జరిగిన సంఘటన పట్ల బందుకు పిలుపునిచ్చిన ఆదివాసి గిరిజన సంఘాలు, ఆదివాసి గిరిజనులను అదుపు చేయలేకపోయారు. ఆదివాసీ గిరిజనులు, ఓ వర్గం ప్రజలకు చెందిన వ్యాపార సముదాయాలపై దాడి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్నాయి. పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి శాయాసక్తుల ప్రయత్నిస్తున్నారు. కాగా జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, బుధవారం రోజున గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ బాధితురాలికి అండగా ఉంటామని, నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు చేపడుతామని హామీని ఇచ్చారు. ఆదివాసి గిరిజనులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అసంతృప్తి,అసహనం ఎటు వంటి మలుపులు తిరుగుతుందోనని, సున్నితమైన ఈ అంశం పట్ల ప్రభుత్వం చాలా జాగ్రత్తగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం

**చదువు క్రమశిక్షణ దేశానికి రక్షణ కవచాలు**

**మాజీ ప్రధాన ఆచార్యులు బాదం వెంకటేశ్వర్లు**

**వనపర్తి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్)**

విద్యతో పాటు సంస్కారం చాలా అవసరం అని.. అత్యున్నత విద్యార్హత కలిగిన ఒక సంస్కారహీన ప్రభుత్వద్యోగి రహస్యంగా ఉంచాల్సిన దేశ రహస్యాలను విదేశాలకు తెలియజేసినాడని శిశు మందీర్ మాజీ ప్రధాన ఆచార్యులు బాదం వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం గురించిన ఆలోచన లేక తన కుటుంబసుఖాలకై స్వార్ధంతో ఇలా చేశాడు.. దీంతో సంస్కారం దేశభక్తి ఆవశ్యకత మనకు విధితమౌతున్నాయి.

**చదువు క్రమశిక్షణ దేశానికి రక్షణ కవచాలు**

దేశాభివృద్ధికి మంచి ఉపాధ్యాయుని ఆవశ్యకత ఈరోజుల్లో తల్లిదండ్రులు తమ సంతానమును డాక్టర్లుగా.. ఇంజనీర్లుగా తయారు కావాలని భావిస్తున్నారు. విద్యార్థుల లోనూ అదే భావనయున్నది.. దేశాభివృద్ధికి శాస్త్రవేత్తలు ఇంజనీర్లు డాక్టర్లు అవసరమని కొందరు ఆలోచిస్తే.. మంచి పరిపాలకులుగా ఐఏఎస్ ఐపీఎస్, ఐఆర్ఎస్.. బాధ్యతలలో ఉండాలని మరికొందరు ఆలోచిస్తున్నారు.

**జీవితానికి పాఠశాలే పునాది**

మానవ జీవితానికి పునాది వేసేది పాఠశాలలేనని విద్యావంతులు ఎక్కడికి వెళ్లినా పూజింపబడతారని తల్లిదండ్రులు క్రమశిక్షణ పాటిస్తూ తమ పిల్లలకు అలవార్చాలని..చీకటి నుంచి వెలుగులోకి మన జీవితాన్ని నడిపించేది కేవలం విద్యేనని పదవులు శాశ్వతం కాదు జీవితం విలువలే ముఖ్యం వ్యక్తిగత గౌరవం పొందేలా జీవితాన్ని మలుచుకోవాలి విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నప్పుడే గురువులకు నిజమైన సంతోషమన్నారు.

**విద్య ద్వారానే సమాజాభివృద్ధి**

ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని సాధన దిశగా కృషి చేయాలని అన్నారు.

**దేశభక్తి విద్యార్థులలో ఏ విధంగా నిర్మాణం చేయాలి**

జపాన్లో ప్రతి పౌరుడు దేశభక్తుడే.. అవమానంగ తమ దేశాన్ని గూర్చి ఎవరైనా మాట్లాడితే సహించరు.. ఒకసారి స్వామి రామతీర్థ జపాన్ కు వెడతాడు..మధ్యలో ఒక స్టేషన్లో దిగి అరటి పండ్లకు వెతుకుతాడు..అచట దొరకవు. ఎదురుగానున్న జపాన్ యువకుడు ఫలములను తెచ్చి ఇచ్చి స్వామి రామతీర్థ ఇచ్చు డబ్బులు తీసుకొనకుండా జపాన్ దేశంలో ఫలములు దొరకవని మీ దేశంలో చెప్పవద్దంటాడు.



**ఉపాధ్యాయునికి జవాబుదారితనం**

పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులకు జవాబుదారితనం పెరగాలన్నారు. కంప్యూటర్ యుగంలో పోటీ అనేది సహజమని విద్యార్థులు దానిని ఆరోగ్యకరంగా తీసుకొని ప్రతిభను చాటుతారు..పోటీని ఎదుర్కోవాలని సాధన తో పాటు లక్ష్యంతో పాటు కృషితోడైతే గమ్యాన్ని సులభంగా అందుకోవచ్చునారు.

**ఉపాధ్యాయులది మహోన్నతమైన బాధ్యత**

భారత పునర్నిర్మాణంలో ఉపాధ్యాయులదే గొప్పనైన పాత్ర చిన్నారులను తీర్చిదిద్దే కార్యాచరణ క్రమం ఇంట్లో తల్లిదండ్రుల నుంచి పాఠశాలలో ఉపాధ్యాయుల నుంచి ప్రారంభమై చివరికి వారు రాజకీయ పరిపాలన తదితర రంగాల్లో మానవీయ దృక్పథంతో విధులను నిర్వహించడం ప్రతిఫలించాలి.. ఎందరో విద్యార్థులు రాజకీయాల్లో సచివాలయాల్లో విద్యారంగంలో బ్యాంకులలో ఇన్సూరెన్స్ కార్యాలయాల్లో ఇతర ఉపాధి రంగాల్లో ప్రాతినిత్యం వహిస్తారు.. ఒకవేళ వారు స్వార్థపరులుగా మారినట్లయితే వారికి విలువలతో కూడిన విద్య బోధించలేదని అర్థం.ఉపాధ్యాయులు ఒక సాధారణ ఉద్యోగుల కాకుండా బృహత్తరమైన జాతి నిర్మాణ బాధ్యతను నిర్వహిస్తున్నామని గుర్తించుకోవాలి విద్య మనిషిని మనిషిగా మారుస్తుంది.

**క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవాలి**

క్రమశిక్షణతో కష్టపడితే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కాదని ప్రతి చిన్న విషయానికి కృంగిపోవద్దన్నారు. పాజిటివ్ థింకింగ్ తో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వృత్తిపరమైన ఇబ్బందులు అన్ని స్థాయిలో ఉంటాయని వాటిని అధిగమించడమే పనిగా పెట్టుకోకుండా లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

**చదువు జీవితాన్ని మారుస్తుంది**

విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని చదివే జీవితాలను మారుస్తుందని.. విద్యార్థులు పట్టుదలతో చదువుతే భవిష్యత్తు ఉంటుందని ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక పిల్లలకు ఎక్కువగా నాలెడ్జ్ వచ్చిందని టెక్నాలజీలో మనం స్ట్రాంగ్ గా ఉన్నామని అమెరికాలో ఉండే పిల్లలకంటే ఇండియాలోని పిల్లలు ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నారని విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలని పరీక్ష సమయంలో ప్రతి ఒక్కరిలోను టెన్షన్ ఉంటుంది భయపడటం వల్ల అప్పటివరకు చదివిన అంశాలన్నీ మర్చిపోతారు. పరీక్షలను గేమ్ లా ఒక ఆటలా తీసుకోవాలి సబ్జెక్టును అవగాహన చేసుకుని చదివితే బాగా గుర్తుంటుంది తల్లిదండ్రులు స్నేహితులుగా మారాలి. చాలామంది తల్లిదండ్రులు ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతుంటారని ఇది పిల్లలకి ఏమాత్రం శ్రేయస్కరం కాదని మానసిక శారీరిక విశ్రాంతి కల్పించాలని సమయానికి సరైన ఆహారం అందివ్వడంతో పాటు ఇంట్లో వారికి ఏకాగ్రతకు సంబంధించి ఇబ్బంది లేకుండా చూడాలని తోటి విద్యార్థులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పోల్చకూడదు

**పూర్వకాలంలో శిష్యుల వలన గురువులకు గౌరవం లభించేది**

పూర్వకాలంలో శిశువుల వలన గురువులకు గర్వం లభించేది. శ్రీరాముని వల్ల వశిష్టునికి.. శ్రీకృష్ణుని వల్ల సందీప్ నికి శివాజీ వాళ్ళ సమర్థ రామదాసు కు. చంద్రగుప్తిని వల్ల చాణుక్యునికి..

**ఆచార్యుల ప్రవర్తన ఆదర్శప్రాయముగా ఉండాలి**

విద్యార్థులను పెడదారి పట్టించేదిగా ఉండరాదు..వ్యక్తుల్లో సంస్కారము నింపేందుకు ప్రముఖకారకుడు ఆచార్యుడు ఆ తరువాత తల్లిదండ్రులు ఆచార్యుడు తన ప్రబోధము ద్వారా ప్రవర్తన ద్వారా విద్యార్థులలో సుగుణ సంపతిని కలగజేయాలి. నీతి నిజాయితీ దేశభక్తి దైవభక్తి విద్యార్థుల లో కలిగింపజేయాలి..అప్పుడే ఆచార్యుడు భావితరాలను తీర్చిదిద్దే వ్యవస్థను రూపొందించిన వాడవుతాడు. మనం ఒక పవిత్రమైన వృత్తిలో ప్రవేశించినాము..కనుక చక్కని భావాలను విద్యార్థులలో ప్రవేశపెట్టి సుయోగ్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆచార్యులపై ఉన్నది.

**లక్ష్యం ఏర్పరచుకుంటేనే పురోగతి**

ప్రతి విద్యార్థికి నిర్దేశిత లక్ష్యం అవసరమని చదువుతోపాటు వ్యక్తిత్వం కూడా అవసరమన్నారు.ప్రతి విద్యార్థి నిర్దేశిత లక్ష్యం నిర్ణయించుకున్నప్పుడే జీవితంలో రాణించగలుగుతున్నారు. చదువులో రాణించాలంటే ఏకాగ్రత పట్టుదల అవసరమని అందుకు అనుగుణంగా వ్యాయామము ధ్యానం ఆసనాలు అలవాటు చేసుకోవాలన్నారు. మాతృభాషతోపాటు ఆంగ్లంలోనూ పట్టు సాధించాలన్నారు గెలుపు ఓటములు సర్వసాధారణమని ప్రతి ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు సమయం చాలా విలువైనది వృధా చేసుకోకూడదు అన్నారు చదువుతోపాటు వ్యక్తిత్వానికి తోడ్పడి ఇతర అంశాల్లో శిక్షణ పొందాలన్నారు.

**గురువులకు నిజమైన సంతోషము**

ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని సాధన దిశగా కృషి చేయాలని విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులకు జవాబుదారితనం పెరగాలన్నారు. కంప్యూటర్ యుగంలో పోటీ అనేది సహజమని విద్యార్థులు దానిని ఆరోగ్యకరంగా తీసుకొని ప్రతిభను చాటాలి పోటీని ఎదుర్కోవాలని లక్ష్యంతో పాటు కృషితోడైతే గమ్యాన్ని సులభంగా అందుకోవచ్చున్నారు.వ్యక్తిగత గౌరవం పొందేలా జీవితాన్ని మలుచుకోవాలి విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నప్పుడే గురువులకు నిజమైన సంతోషము.

# అనుకోని విపత్తు... అందరం కలిసి ఎదుర్కొందాం

**ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తాం..**

**వరద బాధితులకు అండగా నిలబడదాం**

**వస్తువుల రూపంలో సహాయ సహకారాలు అందించాలని కోరుతున్న...**

**అక్రమ కట్టడాలను ఉపేక్షించను..**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి...**




**కోదాడ(అనంతగిరి), సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):**
అనుకొని వరద విపత్తు... అందరం కలిసి ఎదుర్కొందాం... వరద బాధితులకు అండగా నిలబడదాం... పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరం వస్తువుల రూపంలో సహాయ సహకారాలు అందించి బాధిత కుటుంబాలకు భరోసా కల్పిద్దామని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా వరద ప్రభావిత గ్రామాలను గుర్తించామన్నారు. కోదాడ మండలంలో రెడ్లకుంట, తొగర్రాయి, కూచిపూడి తండ, చిమిర్యాల, చిలుకూరు మండలంలో నారాయణపురం అనంతగిరి మండలంలోని గొండ్రియల, చనుపల్లి, కొత్తగూడెం, కిష్టాపురం గ్రామాలతో పాటు కోదాడ పట్టణంలోని పలు వార్డులలో నష్టం వాటిల్లిందన్నారు. నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రపురం వద్ద కాలువకు గండి పడటంతో పంట నష్టం వాటిల్లిందన్నారు. పూర్తిస్థాయిలో పంట నష్టం పై మరో వారం రోజుల్లో అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. . నియోజకవర్గ వ్యాప్తంగా 13 రహదారులు దెబ్బతిన్నట్లుగా తెలిపారు. పలు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగినట్లుగా తెలిపారు. అదేవిధంగా మునగాల మండలం తాడ్వాయి గ్రామంలోని బ్రిడ్జి పూర్తిగా దెబ్బతన్నదని ,దీనికి సంబంధించి ఎస్టిమేషన్ పంపించి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లుగా తెలిపారు.

వరద బాధితులకు ఆయా గ్రామాలలోని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెడ్ల కుంట గ్రామంలో 70, తొగర్రాయిలో 300, కూచిపూడి తండాలో 300, గొండ్రియల గ్రామంలో 350, కిష్టాపురం గ్రామంలో 200, రంగాయిగూడెం లో 300, చిలుకూరులో 150, కుదర పట్టణంలో 300, పట్టణంలోని మైనార్టీ సోషల్ వెల్ఫేర్ లో 300, మంది పునరావాస కేంద్రాల్లో ఆసరా పొందుతున్నట్లుగా తెలిపారు. కేంద్రంలో ఉన్న బాధితలకు భోజనం సౌకర్యం ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు కోల్పోయిన ప్రతి ఒకటి తప్పనిసరిగా తిరిగి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇది రాజకీయాలకు సమయం కాదు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు కూడా స్వచ్ఛందంగా వరద బాధితులకు అండగా నిలబడేందుకు ముందుకు రావాలని కోరారు. వస్తురూపేనా సహాయం అందించాలని మీరు అందించే సహాయం క్యాంపు కార్యాలయంలో మా సిబ్బంది తీసుకుంటారని తెలిపారు . ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు కౌన్సిలర్లు గంధం యాదగిరి ,షాబుద్దీన్, కోటిరెడ్డి, సుబ్బారావు ,మదార్ ,షఫీ, స్వామి నాయక్ ,శ్రీనివాస్ యాదవ్ నాయకులు ఉన్నారు.

**అక్రమ కట్టడాలపై ఉపేక్షించేది లేదు...**
కోదాడ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరిపిన కట్టడాలపై చర్యలు తీసుకుంటామని, ఇటువంటి అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. ప్రస్తుతం వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్నారని త్వరలోనే ఈ అక్రమ కట్టడాలపై పూర్తిస్థాయిలో సమీక్ష ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కొలీగ్‌ను చంపేసిన టెకీలు

## - ఆపై పార్టీలో ఎంజాయ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):**
మద్యం మత్తులో తోటి కొలీగ్‌ని ఇద్దరు టెకీలు బలవంతంగా స్విమ్మింగ్ పూల్‌లో నెట్టగా అతడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్? పోలీస్? స్టేషన్? పరిధిలో చోటు చేసుకుంది. వర్క్ విషయంలో జరిగిన చిన్న గొడవను మనసులో పెట్టుకొని ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది.
హైదరాబాద్ శివారు ఘట్కేసర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ యువకుడిని తోటి సహోద్యోగులే హత్య చేశారు. మద్యం మత్తులో ఈత కొలనులో తోసేసి చంపేశారు. ఈత రాదని ప్రాధేయపడినా వినిపించుకోకుండా నీటిలో తోసేశారు. అనంతరం ఏమీ తెలియనట్లు మద్యం పార్టీలో ఎంజాయ్ చేశారు.
వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ ఐటీ సంస్థలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణం మారుతీ నగర్‌కు చెందిన గజబింకర్ అజయ్ తేజ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా గత కొంత కాలంగా పని చేస్తున్నాడు. తమ ప్రాజెక్ట్ టీమ్ లీడర్ శ్రీకాంత్ పుట్టిన రోజు సెలబ్రేషన్‌లో భాగంగా సెప్టెంబర్ 1న మద్యం పార్టీ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేయటం, పుట్టినరోజు ఉండటంతో వారం రోజుల ముందే పార్టీకి ప్లాన్ చేశాడు. ఘట్‌కేసర్ మండల పరిధిలోని ఘనపూర్‌లోని ఓ గెస్ట్‌హౌస్‌ను పార్టీ కోసం బుక్ చేశాడు.
ఈ పార్టీకి అజయ్ తేజతోపాటు దాదాపు 20 మంది కొలీగ్స్ హాజరయ్యారు.
ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో గెస్ట్ హౌజ్‌కు చేరుకున్నారు. మొత్తం ఉద్యోగుల్లో 13 మంది మహిళలు కూడా ఉన్నారు. అక్కడ పీకల దాకా మద్యం సేవించారు. అనంతరం రాత్రి 12 గంటల తర్వాత శ్రీకాంత్‌చే కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. అరగంట అనంతరం మద్యం మత్తులో అజయ్ తేజ్ స్నేహితులు సాయి కుమార్, రంజిత్ రెడ్డి అతడిని బలవంతంగా పక్కకు తీసుకెళ్లారు. గెస్ట్ హౌజ్‌లోని ఈత కొలనులో తోసేసేందుకు ప్రయత్నించారు. అయితే తనకు ఈత రాదని.. వదిలేయాలని అజయ్ తేజ్ వారిని ప్రాధేయపడ్డాడు.
అయినా వినిపించుకోకుండా మద్యం మత్తులో అజయ్‌ను స్విమ్మింగ్ పూల్‌లో తోసేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పార్టీ జరిగే ప్రాంతానికి వెళ్లి మ్యూజిక్ సిస్టం ఆనే చేసి డ్యాన్స్ చేశారు. దాదాపు 40 నిమిషా తర్వాత పార్టీకి హాజరైన ఓ సహోద్యోగి అజయ్ కనిపించటం లేదని గుర్తించి టీమ్ లీడర్ శ్రీకాంత్‌కు విషయం చెప్పారు.
దీంతో అందరూ కలిసి గెస్ట్ హౌస్ పరిసరాలను వెతగ్గా.. స్విమ్మింగ్ పూల్‌లో తేలుతూ కనిపించాడు. దీంతో అతడిని బయటకు తీసి వెంటనే హాస్పిటల్ తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో సమాచారం పోలీసులకు అందించారు.
**ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు..** మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు. మృతుడి మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా.. తోటి ఉద్యోగులు, స్నేహితులైన రంజి త్‌రెడ్డి, సాయి కుమార్ కావాలనే కొలనులో తోసేసినట్లు తేలింది. ఆఫీసులో వర్క్ విషయంలో జరిగిన చిన్న గొడవను మనసులో పెట్టుకొని పార్టీలో అతడిని కొలనులోకి తోసేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారిద్దరితో పాటు అనుమతి లేకుండా పార్టీ ఏర్పాటు చేసిన టీమ్ లీడర్ శ్రీకాంత్, మద్యం పార్టీకి గెస్ట్‌హౌస్‌ను ఇచ్చిన నిర్వాహకుడు వెంకటేశ్‌లపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## సకల దేవత జనులకు అధిపతి విఘ్నేశ్వరుడు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 (నినాదం న్యూస్)**



సకల దేవత జనులకు అధిపతి విఘ్నేశ్వరుడని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయం అర్చకుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు వలివేటి వీరభద్ర శర్మ అన్నారు. ఆగస్టు 7వ తేదీన వినాయక చవితి కలశ స్థాపన 16వ తేదీన నిమజ్జనం ఉంటుందని తెలిపారు. గణనాథుని జన్మదినం భాద్రపద మాస శుద్ధ చవితి రోజు గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటామని అన్నారు. భక్తులు శాంతియుత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

## వరద బాధితులకు పరిహారం అందే వరకు పోరాటం

**- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి**

**కోదాడ (అనంతగిరి), సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):**



అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షానికి పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో అనంతగిరి మండలం చనుపల్లి, కిష్టాపురం, గొండ్రియల గ్రామాలలోకి వరద నీరు పోటెత్తడంతో ఆస్తి నష్టం ,పంట నష్టం వాటిల్లిందని తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధితులకు సహాయం అందించాలని బిఆర్ఎస్ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులు ఆయా గ్రామాలలో పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వరద తీవ్రతకు గురైన లబ్ధిదారులను గుర్తించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో టిఆర్ఎస్ పార్టీ తరఫున వరద బాధితులకు అండగా ధర్నాలు తప్పవని హెచ్చరించారు.